

ఖరీదైన బైక్ దొంగిలించాలని ఆశపడిన ఓ చిల్లర దొంగ, తాను కోల్పోయిన ప్రేమను వెతుక్కుంటూ బయలుదేరిన పెద్దింటి కుర్రాడు.. ఇద్దరూ ఓచోట తారసపడితే! కలిసి ప్రయాణిస్తే! ఒకరి జీవితం మరొకర్ని ఎలా ప్రభావితం చేసింది? ఇద్దరూ కలిసి సాగించిన ఆ జర్నీ ఏ బాటలో నడిపించింది? ఈపాటికే అర్థమై ఉంటుంది, ఇది 'గమ్యం' సినిమా కథ అని. ఈ కథకు మూలమైన పుస్తకం Zen and the Art of Motorcycle Maintenance ఈ ఏడాది అర్ధ శతాబ్ది వేడుకలు జరుపుకొంటున్నది.

# యాభై ఏండ్ల.. మోటార్‌సైకిల్




**1960ల కాలం.**

రెండో ప్రపంచయుద్ధం నుంచి బయటికి వస్తున్న సమయం.

విశ్వం నలుమూలలా సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నది. ఫ్యాషన్, సంపాదన, ఉత్పత్తి, ప్రయాణం.. అన్నిటిలోనూ అనూహ్యమైన మార్పులే. వేగంగా మారుతున్న ప్రపంచం.. తాపీగా అడుగులేస్తున్న మనిషిని అలజడికి గురిచేసింది. తనలోపలికి తొంగి చూసుకునేలా చేసింది. హిప్పీలాంటి సంస్కృతులు రావడానికి ఇదే కారణం. ఇలాంటి నేపథ్యంలో వచ్చిన ఓ పుస్తకం... యువతకు ఓ స్పష్టత అందించింది. అదే Zen and the Art of Motorcycle Maintenance. మార్కెట్లోకి రాగానే ఈ పుస్తకం సూపర్ హిట్ అయ్యింది. లక్షల కాపీలు అమ్ముడుపోయాయి. రాత్రికిరాత్రే పుస్తక రచయిత రాబర్ట్ పర్సిగ్ సెలెబ్రిటీ అయిపోయారు.

**ఏముంది అందులో..**

ఇదో ఊహాజనిత ఆత్మకథ. రచయిత, తన కొడుకుతో కలిసి తన పాత బైక్ మీద అమెరికాలోని మినెసోటా నుంచి ఉత్తర కాలిఫోర్నియాకు చేసే ప్రయాణమే ఇతివృత్తం. వీరితో పాటు మరో ఇద్దరు మిత్రులు కూడా మొదటి తొమ్మిది రోజుల పాటు కలిసి ప్రయాణిస్తారు. వారిది సరికొత్త ఖరీదైన బైక్. కానీ దానిపట్ల ఉదాసీనత. పాడైతే ఎలా బాగుచేయాలో కూడా తెలియదు. రచయిత అలా కాదు. తన పాత బైక్ పట్ల పూర్తి అవగాహన ఉంది. దానికి వచ్చే సమస్యలను ఎలా పరిష్కరించాలో కూడా తెలుసు. ఆ బైక్‌ను సరిచేసుకుంటూ, ప్రయాణం కొనసాగిస్తూ... తన కొడుకుతో జీవితం గురించి తన అనుభవాలు, ఆలోచనలు పంచుకుంటాడు. ఇందులోని మోటర్‌సైకిల్ కానీ, ప్రయాణం కానీ కథలను అల్లుకోవడానికి ఓ అవకాశం మాత్రమే. ఓ సాధారణ లేదా అల్పమైన వస్తువు లేదా విషయం చుట్టూ అద్భుతమైన కథలను అల్లుకునే ప్రక్రియను మెక్‌గఫిన్ (MacGuffin) అంటారు. ఈ పుస్తకంలోనూ అదే కనిపిస్తుంది. ఈ తండ్రీకొడుకుల సంభాషణలో ఎన్నో జీవితసత్యాలు వినిపిస్తాయి. ఎన్నో ప్రశ్నలకు జవాబులు కనిపిస్తాయి. మనం పరమ సత్యమని భావించే ఏ విషయమూ నాటికి నూరు శాతం నిజం కాకపోవచ్చు అంటారు రచయిత. ఒకవేళ అది నిజమైనా అందరికీ ఆమోదయోగ్యం కాకపోవచ్చనీ చెబుతారు. అలాంటి సమయంలో, మన నిర్ణయం సరైందా కాదా అనేది తెలుసుకోవడం ఎలా? అనే ప్రశ్నకూ జవాబు ఇస్తారు. సందర్భానికి తగినట్టు, మన లక్ష్యానికి ఉపయోగపడేలా ఓ నిర్ణయానికి చేరుకోవాలని సూచిస్తారు. ఇలాంటి ఆణిముత్యాలెన్నో ఈ పుస్తకం నిండా పరుచుకుని కనిపిస్తాయి. సమాజంలోని ఒత్తిడి, నిరాసక్తత, అసహనం లాంటి ఎన్నో సమస్యలకు ఈ పుస్తకంలో జవాబు దొరుకుతుంది.

> **బతుకు కూడా ఓ బండి లాంటిదే. గమ్యంలేని ప్రయాణానికి అర్థం ఉండదు. అలా అని గమ్యం మీదే మనసు పెట్టి ప్రయాణం సాగిస్తే.. వర్తమానాన్ని ఆస్వాదించలేం. వాహనానికి మరమ్మతులు తప్పనట్టే, జీవితంలో సవాళ్లు, సంక్షోభాలు ఉంటాయి. బండికి ఇంధనం.. బతుకుకు కలలు. అడుగు ముందుకేసిన ప్రతిసారీ అద్దంలో వెనక్కి చూసుకోవాల్సిందే. జీవితాన్ని కూడా సమీక్షించుకోవాల్సిందే. జీవన యాత్రలో ఎదురుదెబ్బలు తగుల్తాయి. అవి పాఠాలే కానీ, ఓటమి చిహ్నాలు కానేకాదు. రెడ్ సిగ్నల్‌ను గౌరవించాలి. నైతికతకు విలువ ఇవ్వాలి.**

**తిరస్కరణల పరంపర**

ఈ పుస్తకాన్ని రాయడానికి రాబర్ట్‌కు నాలుగేళ్లు పట్టింది. ఆ ప్రయత్నంలో రేయింబగళ్లు శ్రమించాడు. ఇంతాచేసి, ఈ పుస్తకాన్ని ఏ ప్రచురణకర్తా స్వీకరించలేదు. ఏకంగా 121 సార్లు పబ్లిషర్స్ తిరస్కరించారట. ఎట్టకేలకు 1974లో ఇది ప్రచురణకు నోచుకుంది. శ్రమకు ఫలితం దక్కింది. అయితే రాబర్ట్ జీవితం... ఈ పుస్తకంలా విజయం సాధించలేదు. ఎన్నో ఒడుదొడుకులు. ఏ కొడుకునైతే ప్రధానపాత్రగా చేసుకుని తన పుస్తకం రాశారో, ఆ కొడుకు ఓ దుర్ఘటనలో చనిపోయాడు. తనకేమో స్కిజోఫ్రీనియా దాపురించింది. దీంతో ఎలక్ట్రిక్ షాక్‌లతో కూడిన చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. కష్టకాలంలో భార్య కూడా విడాకులు తీసుకుంది. ఇలాంటి ఎన్నో సవాళ్లను దాటి 88 ఏళ్ల పాటు జీవించగలిగారు.

* * *

Zen and the Art of Motorcycle Maintenance పుస్తకం వచ్చి సరిగ్గా 50 ఏళ్లవుతున్నది. ఇప్పటికీ ఈ రచన వ్యక్తిత్వవికాస పుస్తకాల్లో సంచలనమే. ఎటుచూసినా యుద్ధమేఘాలు, సంక్షోభంలో అంతర్జాతీయ మార్కెట్లు, కొవిడ్ భయం ఓవైపు... భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్న కృత్రిమ మేధ, భూతాపం లాంటి సవాళ్ల మధ్య చదవాల్సిన పుస్తకమే ఇది! తెలుగు అనువాదం కూడా మార్కెట్‌లో లభిస్తున్నది. వీలైతే, మూలాన్ని చదవడమే ఉత్తమం. ఎందుకంటే అందులో ఆత్మ ఉంటుంది. ■